క్లుప్తంగా

అనాథాశ్రమంలో అన్నసమారాధన



బాలలకు భోజనం వడ్డిస్తున్న దాతలు

అక్కిరెడ్డిపాలెం: స్ఫూర్తి అనాథాశ్రమంలో బుధవారం అన్నసమారాధన నిర్వహించారు. గాజువాక పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జి.ఎ.నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన తనయుడు, మాజీ కార్పొరేటర్ జి.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మాడుగుల నియోజకవర్గం పరిశీలకుడు ఉరుకూటి అప్పారావు, నాయకులు బంగారయ్య శ్రీను, పల్లేల శ్రీనివాసరావు, ఉరుకూటి అప్పలనాయుడు, మాడిశ రాము, ఆకుల ఉపమాక తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గాజువాక: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను బీజేపీ నాయకులు 70వ వార్డులో బుధవారం పంపిణీ చేశారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దీసంకొండ కృష్ణంరాజు ఆధ్వర్యంలో వార్డులోని ఎల్వీనగర్, డ్రైవర్స్ కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ డీఈవీ అప్పారావు, వార్డు నాయకులు పావని, సంతోష్, నాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం అగనంపూడి దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ముళ్ల పొదల్లో మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించడంతో ఆ వ్యక్తి 4 రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని వైద్యులు తెలిపారు. మృతుడు నలుపు రంగు ప్యాంటు, పువ్వులతో కూడిన తెలుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, వయస్సు 43 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఆ వ్యక్తికి చెందినవారు ఎవరైనా ఉంటే దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఆ వ్యక్తి ఎవరు, అక్కడికి ఎలా వచ్చాడు, ఎవరైనా చంపి పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా..

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- పేదలకు పరిమితి లేని వైద్యం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- గాజువాక పీహెచ్‌సీలో శిబిరానికి విశేష స్పందన



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పిల్లలకు మందులు అందిస్తున్న సిబ్బంది



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఫార్మసిస్టు



రక్త పరీక్ష చేస్తున్న సిబ్బంది

గాజువాక: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అడుగులేశారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఇందుకోసం వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారన్నారు. కొత్త గాజువాక పీహెచ్‌సీలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు వైద్యం అందలేదని రాష్ట్రంలో ఏ కుటుంబమూ బాధపడకుండా చూడటమే లక్ష్యంగా ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చారని అన్నారు. అందులో భాగంగానే జగనన్న సురక్ష-2 కూడా అమలు చేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలతో పాటు ఆరోగ్య పరీక్షలను ఉచితంగా అందిస్తారన్నారు. అవసరమైన రోగులను మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు.

పేదల సంక్షేమానికి సీఎం కృషి

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం పేదల కోసం ఆలోచిస్తున్నారన్నారు. వారికి మెరుగైన వైద్యం అందాలన్న ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారన్నారు. ఒక పక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధితో పాటు ఆరోగ్యానికి కూడా పెద్దపీట వేసిన ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, గాజువాక వైద్యాధికారి డాక్టర్ సుధాకర్, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, కార్పొరేటర్ రాజాన రామారావు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అన్ని పరీక్షలు చేశారు



ఆరోగ్యపరంగా చాలా సమస్యలతో బాధ పడుతున్నాను. నాకు యూరిన్ ఇన్ఫెక్షన్ ఉంది. దురదలు, జలుబు, దగ్గు, కాళ్లు పొంగడం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నాను. ఇక్కడ డాక్టర్లు అన్ని పరీక్షలు చేశారు. స్కానింగ్ తీయాలని చెప్పారు. దీనికోసం కేజీహెచ్‌కు పంపిస్తామన్నారు. ఆరోగ్యంగా ఎలా ఉండాలన్న విషయాన్ని చాలా బాగా వివరించారు.

– వేమురెడ్డి ఎరుకమ్మ, సింహగిరి కాలనీ

స్పెషలిస్టులు చెక్ చేశారు



కాళ్లు, చేతులు పీకడం, చెవుల దురదలు, కళ్ల మంటలతో ఇబ్బంది పడుతున్నాను. జగనన్న సురక్ష శిబిరం జరుగుతుందని వచ్చి చూపించుకున్నాను. నాకు స్పెషలిస్టు డాక్టర్ అన్ని పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఇచ్చారు. మందులను సరిగ్గా వాడటంతో పాటు చిన్నపాటి జాగ్రత్తలను తీసుకుంటే తగ్గిపోతాయని చెప్పారు. మాకు దగ్గరలోనే శిబిరం పెట్టి, ఉచితంగా పరీక్షలు చేశారు. ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు.

– వి. లక్ష్మి, గాజువాక

కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాను



కొద్దికాలంగా నేను కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాను. దీంతో మొహం పొంగిపోతోంది. బీపీ కూడా ఉంది. ఇక్కడ స్పెషలిస్టులు ఉన్నారని చెప్పడంతో వచ్చాను. చాలా బాగా చూశారు. టెస్టులు చేయాలని చెప్పారు. మందులు ఇచ్చారు. ప్రైవేట్ ఆస్పత్రిలో కూడా ఇంత వివరంగా ఎవరూ చెప్పలేదు. ఇక్కడ డాక్టర్ అన్ని విషయాలను అర్థమయ్యే విధంగా చెప్పారు.

– పైడమ్మ, చినగంట్యాడ

వైద్యులు చాలా బాగా చూశారు



నేను వెల్డర్‌గా పని చేస్తున్నాను. వారం రోజులుగా దురదలు బాగా ఎక్కువగా వస్తున్నాయి. ఇక్కడ డాక్టర్‌కు చూపించుకున్నాను. కొద్దిరోజులు మందులు వాడితే తగ్గిపోతుందని చెప్పారు. నా సమస్య వినడంతో పాటు ఆరోగ్య జాగ్రత్తలను కూడా వివరించారు. డాక్టర్ చాలా బాగా చూశారు.

– కోరాడ కామేష్, ఆటోనగర్

ఘనంగా పులి భూలోకరెడ్డి విగ్రహావిష్కరణ



భూలోకరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ నిర్వాసితుల సంఘం అధ్యక్షునిగా పులి భూలోకరెడ్డి చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నిర్వాసితుల సంఘం నాయకుడు పులి భూలోకరెడ్డి కాంస్య విగ్రహాన్ని పెదగంట్యాడ జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పల్లా శ్రీనివాసరావులతో కలసి బుధవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పులి వెంకటరమణారెడ్డి, కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, తిప్పల వంశీరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, కాకి గోవిందరెడ్డి, దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్మిక నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి హక్కు పత్రాల పంపిణీకి వినతి

గాజువాక: గాజువాక హౌస్ కమిటీ పరిధిలో 301 జీవో ప్రకారం కన్వేయన్స్ డీడ్స్‌కు రిజిస్ట్రేషన్లు చేయించుకున్న వారికి డాక్యుమెంట్లను వెంటనే పంపిణీ చేయాలని జిల్లా పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి కోరారు. గాజువాక హౌస్ కమిటీ పరిధిలో సుమారు 15 వేల మందికి ఇళ్లు ఉన్నా, ఆస్తి హక్కు పత్రాలు లేకుండా ఉన్నారని పేర్కొన్నారు. జీవో 301 ప్రకారం 7228 మంది పట్టాలు కలిగి ఉన్నారని, వారిలో 4752 మంది మాత్రమే కన్వేయన్స్ డీడ్ పొంది రిజిస్ట్రేషన్లు కూడా చేయించుకున్నారని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో దీప పాశురం



నరసింహుని అవతారంలో ప్రసన్న వేంకటేశ్వరుడు



ప్రసన్న వేంకటేశ్వరాలయంలో వెలుగుతున్న జ్యోతులు



దీప పాశురంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు, అభిషేకాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా బుధవారం దీప పాశురం (18వ పాశురం) భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చరణ జరపగా, ఆలయ ధర్మకర్త ఈ.కె.చారి దంపతులు అభిషేకాలు చేశారు. మహిళలు దీపాలంకరణలో పాల్గొన్నారు. తరువాత ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుని సన్నిధిలో ..

అక్కిరెడ్డిపాలెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో బుధవారం దీపపాశురం నిర్వహించారు. ఆలయంలో ఆండాళ్ అమ్మవారి పూజలు నిర్వహించారు. ప్రసన్న వేంకటేశ్వర స్వామిని నరసింహావతారంలో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ ఈవో జగన్నాధరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

250 టన్నుల చెత్త తరలింపు



చెత్త తొలగిస్తున్న సిబ్బంది

గాజువాక: గాజువాక జోన్‌లో వివిధ చోట్ల పేరుకుపోయిన సుమారు 250 టన్నుల చెత్తను ప్రజారోగ్య విభాగం అధికారులు డంపింగ్ యార్డుకు తరలించారు. కొద్ది రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగడంతో చెత్త పేరుకుపోయిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించి చెత్త తొలగించారు. సమ్మెకు దూరంగా ఉన్న కార్మికులకు తోడుగా మరో 250 మంది ప్రైవేట్ కార్మికులను నియమించారు. వారిద్వారా చెత్తను తొలగించడం కోసం ఆరు టిప్పర్లు, మూడు జేసీబీలు, నాలుగు టాటా ఏస్‌లను ఏర్పాటు చేశారు. వాటిద్వారా చెత్తను తొలగిస్తుండగా సమ్మెలో ఉన్న పలువురు పారిశుధ్య సిబ్బంది అడ్డుకుని విధులకు ఆటంకం కలిగించారు. దీంతో రంగప్రవేశం చేసిన పోలీసులు ఆరుగురు కార్మికులను అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. జోనల్ కమిషనర్ పి.సింహాచలం, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది గాజువాక, కూర్మన్నపాలెం, కణితి రోడ్ తదితర ప్రధాన ప్రాంతాల్లో చెత్తను తరలించారు.

‘విశాఖ ఉక్కును కాపాడుకుంటాం’



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉద్యమాలతో సాధించుకున్న స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1056వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ గురించి ప్రజలందరూ నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పెట్ల సాయమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ దేవి

పెదగంట్యాడ: క్యాన్సర్ రోగికి ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించారు వలంటీర్ సీహెచ్ దేవి. జీవీఎంసీ 65వ వార్డు అశోక్ నగర్ కాలనీకి చెందిన పెట్ల సాయమ్మ అనే వృద్ధురాలు ఎంవీపీ కాలనీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారు. ఆమె కదల్లేని స్థితిలో ఉండడంతో వలంటీర్ దేవి ఆస్పత్రికి వెళ్లి ఆమెకు పింఛన్ అందించారు. కుటుంబ సభ్యులు వలంటీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి

- ఆమె సేవలు చిరస్మరణీయం
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చందు తదితరులు



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, అండిబోయిన లక్ష్మి తదితరులు



87వ వార్డులో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కోమటి శ్రీనివాసరావు



అగనంపూడి హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల కమిటీ



స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న రామస్వామి

పెదగంట్యాడ: దేశంలో మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. నాడు ఆమె వేసిన తొలి అడుగే నేటి మహిళల ప్రగతికి కారణమని కొనియాడారు. సావిత్రిబాయి జయంతి సందర్భంగా యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి ఆధ్వర్యంలో గాజువాక వినాయకనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, అండిబోయిన అప్పారావు, నడిగట్ల గురుమూర్తి, సుక్క ఈశ్వరరావు, ఉరుకూటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో ..

స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి ఆధ్వర్యంలో సావిత్రిబాయి జయంతిని నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, మార్టుపూడి పరదేశి, ధర్మాల శ్రీనివాసరెడ్డి, మంత్రి మంజుల, గొందేశి వెంకటరమణారెడ్డి, మంత్రి శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి సేవలు అజరామరం

గాజువాక: బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలకు విద్యనందించి స్త్రీ సాధికారత, బీసీల అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి సావిత్రిబాయి పూలే అని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్త్రీ విద్యకు విశేష కృషి చేసిన తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అని పేర్కొన్నారు. ఆమె సేవలు అజరామరమని, ఆమెను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు యువశ్రీ, ప్రమీల, పూర్ణానంద శర్మ, నాయకులు గుడివాడ లతీష్, సిరట్ల శ్రీనివాస్, రెడ్డి జగన్నాథం, వేణుబాబు, చిత్రాడ వెంకట రమణ, పెదిరెడ్ల ఈశ్వరరావు, ఎన్నేటి రమణ, మంత్రి శంకరనారాయణ, వరదాడ చిట్టిబాబు, మార్పు శేషు, షౌకత్ అలీ, రావాడ శివ, పేరం రామకృష్ణారెడ్డి, ప్రభాకర్, ఎలమంచిలి అప్పారావు, అచ్చిబాబు, బాబులునాయుడు, సత్య, రాజ వరలక్ష్మి, వాణి, కనక తదితరులు పాల్గొన్నారు.

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: 87వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. వడ్లపూడి ఈశ్వరరావు, జెర్రిపోతుల ఈశ్వరరావు, కాండ్రేగుల రమణ, కోమటి రమాదేవి, బుగిది రామలక్ష్మి, గాలి రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయినులకు సత్కారం

అగనంపూడి: 85వ వార్డు అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయులను సత్కరించుకొనే అవకాశం దక్కడం సంతోషంగా ఉందన్నారు.


స్టీల్‌ప్లాంట్‌లో..

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో స్టీల్ సిటూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.టి. దాస్, యు.రామస్వామి సావిత్రి బాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ స్త్రీలను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ఆమె చేసిన కృషి అమోఘమన్నారు. ఎన్నో ఒడిదొడుకుల మధ్య ఆమె చేసిన చిన్న ప్రయత్నం కారణంగా ఇప్పుడు ఎంతో మంది స్త్రీలు చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అలాంటి వారికి స్మరించుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసరాజు, కె.గంగాధర్, యు.శ్రీనివాసరావు, టి.వి.కె.రాజు, వి.డి.వి.పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాల అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీకాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న అంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా ముత్యాల కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోష్ఠిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 19వ పాశురాన్ని స్వామివారికి విన్నపం చేశారు. స్వామివారికి విశేష దీప హారతి ఇచ్చారు. పూజల అనంతరం సాయంత్రం 365 ఒత్తులతో హారతి వెలిగించి స్వామివారికి సమర్పించారు.

న్యాయవాది కేవీ స్వామి హఠాన్మరణం



కేవీ స్వామి (ఫైల్)

గాజువాక: సీనియర్ న్యాయవాది, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి (64) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో స్నానం చేసేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు రావడంతో, ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్టు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గాజువాక బార్ అసోసియేషన్‌కు ఆయన నాలుగుసార్లు అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతదేహాన్ని గాజువాక న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. కుమారుడు విదేశాలలో ఉండటం వల్ల అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ఆర్కే ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు.

అనాథల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు



వివరాలు తెలుసుకుంటున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

విశాఖ విద్య: అనాథలు, ఏ దిక్కూ లేనివారి సంరక్షణ కోసం జీవీఎంసీ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జీవీఎంసీ-8వ జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు చెప్పారు. బుచ్చిరాజుపాలెంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్‌ను బుధవారం పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది ఉన్నారు.. వసతి సౌకర్యాల గురించి మేనేజర్ మమతను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని సచివాలయ అడ్మిన్ ఈశ్వరరావుకు సూచించారు. మధ్యాహ్న భోజనం దాతల సాయంతో అందిస్తున్నట్లు షెల్టర్ మేనేజర్ మమత తెలిపారు. కేంద్రంలో ఉన్న వారంతా ఇదే చోట ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనాథలుగా గుర్తించి, తగిన ధృవీకరణతో నూతనంగా ఓటు హక్కు కల్పించే చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.